రిపోర్టర్లు కావలెను

ప్రకాశం జిల్లాలో 'జాతీయ వార్త' తెలుగు దినపత్రికలో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు సంప్రదించగలరు

9908862557

జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ప్రకాశం



జిల్లా వార్తలు

గురువారం | 4-6-2026 | ప్రకాశం | సంపుటి: 3 సంచిక: 688 పేజీలు: 2 వెల : రూ.2

# పొగాకు రైతులను ఆదుకోండి

* గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలి
* రైతులకు న్యాయం చేయండి
* సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లండి
* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడుని కోరిన ఎమ్మెల్యేలు ఇంటూరి, కాకర్ల

కందుకూరు, జూన్ 3 (జాతీయ వార్త): ఈ ఏడాది పొగాకుకు గిట్టుబాటు ధరలేదు. కనీసం పెట్టుబడులు కూడా రావేమోనన్న ఆందోళన రైతుల్లో ఉంది. కందుకూరు ప్రాంత రైతుల ఆవేదనను మీ దృష్టికి తీసుకు వస్తున్నాం. వారికి న్యాయం జరిగేలా వెంటనే చర్యలు తీసుకోండి... అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడుకి కందుకూరు, ఉదయగిరి ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్ విజ్ఞప్తి చేశారు. బుధవారం విజయవాడలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడును ఎమ్మెల్యేలు కలిసి... పొగాకు రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ఏడాది మార్కెట్ ధరలు, వ్యాపారుల మందకొడి కొనుగోళ్లు, రైతుల పెట్టుబడి, దిగుబడి... ఇంకా పలు అంశాలను మంత్రికి వివరించారు. ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. దీనికి మంత్రి స్పందిస్తూ... ఈ వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పొగాకు రైతుల సమస్యలపై అధికారులతో భేటీ జరగబోతోందని వెల్లడించారు. రైతులను తప్పక ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అచ్చెంనాయుడు స్పష్టంచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ... పొగాకు విషయంలో వైసిపి నేతలు అనవసరంగా రార్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. తాము చిత్తశుద్ధితో రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తున్నామని స్పష్టం చేశారు.



## విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

కందుకూరు నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి లను బుధవారం విజయవాడలో కలిసి పలు అంశాలపై చర్చించడంతోపాటు వినతిపత్రం అందించారు. కందుకూరు పట్టణం, పలుకూరు (కందుకూరు మండలం), చేవూరు (గుడ్లూరు మండలం), వెంగళాపురం (లింగసముద్రం మండలం) గ్రామాల పరిధిలో కొత్తగా 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్‌డీఎస్ పథకంలో భాగంగా.... కందుకూరు పట్టణంలో హైమాస్ట్ పోల్స్ (ఎత్తు స్తంభాలు) ఏర్పాటు చేయాలని కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని... పలు మండలాల్లో కొత్తగా ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, అవసరమైన చోట స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతూ.. అందుకు సంబంధించిన వివరాలతో వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు విజ్ఞప్తితో పుల్లారెడ్డి సానుకూలంగా స్పందించి... రెండు మూడు నెలల్లో కచ్చితంగా మంజూరు చేస్తామని తెలిపారు.



# ప్రతి ఓటు విలువైనది.. బీఎల్వోలు.. బీ అలెర్ట్

* ఎలక్ట్రోల్ అధికారులు జాగ్రత్తగా ఎన్యూమరేషన్ చేయాలి
* మాజీ శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్
* ప్రతి ఓటరును బీఎల్వో, టీబీఎల్ఏల సమక్షంలో మ్యాపింగ్ చేయాలి
* ఫారం 6,7,8 వెరిఫికేషన్ అప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలి
* సర్ టాస్క్ ఫోర్స్ మెంబర్ మర్లపాటి మహేష్



కందుకూరు, జూన్ 3 (జాతీయ వార్త): ప్రతి ఓటు విలువైనది.. బీఎల్ఏలు బీ అలెర్ట్‌గా ఉండాలని మాజీ ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యావ్ అన్నారు. బుధవారం కందుకూరులోని ఎస్సీఎస్ కళ్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి బిఎల్ఎల అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఇన్చార్జి బుర్ర మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 20 సంవత్సరాల తరువాత సమగ్ర ఓట్ల సవరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో బూత్ లెవల్ ఏజెంట్లు అందరూ యాక్టివ్ గా ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ సమగ్ర సర్వే ద్వారా బూతులలో కొత్త ఓటర్లు చేర్పులు,మార్పులు, సవరణలు జరుగుతాయన్నారు. ఏజెంట్లు అందరూ చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రతి సంవత్సరం చేసే ఓటర్ల సవరణ లాంటిది కాదు ఇది ప్రతి ఓటర్ ఎస్.ఐ.ఆర్ ద్వారా ఓటును మ్యాపింగ్ చేయించుకోవాలి. అలా మ్యాపింగ్ కాకపోతే ఓట్లు నష్టపోయే పరిస్థితి ఉంటుంది. కందుకూరు నియోజకవర్గంలో 271 బూత్‌లు ఉన్నాయి. మండలాల వారిగా వలేటివారిపాలెంలో 46 బూత్‌లు, లింగసముద్రం మండలంలో 38 బూత్‌లు, కందుకూరు మండలంలో 37బూత్‌లు, కందుకూరు పట్టణంలో 56 బూత్‌లు, గుడ్లూరు మండలంలో 46 బూత్‌లు, ఉలవపాడు మండలంలో 53 బూత్‌లు ఉన్నాయి. తర్వాత అన్నింటిలో మన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున ఏజెంట్లను నియమించి ఎలక్షన్ ఆఫీసులకు అందజేశామని అన్నారు. నియోజకవర్గంలో 2 లక్షల 28 వేల 898 ఓట్లు ఉన్నాయి. ఇప్పటికీ మన నియోజకవర్గంలో 70 శాతం మాత్రమే మ్యాపింగ్ అయివున్నవి. మిగిలిన 30 శాతం ఓట్లలోనే అధికార పార్టీ అక్రమాలకు పాల్పడే అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు గ్రామాల్లో వలస పోయిన ఓటర్ల వెరిఫికేషన్‌లో మన బిఎల్ఏలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. చంద్రబాబు నాయుడు ఓట్లు తీసివేసే మేనేజ్మెంట్ చేయడంలో దిట్ట. చంద్రబాబు నాయుడు జిమ్మిక్కులు అర్థం చేసుకొని నియోజకవర్గంలో మనం చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. గ్రామాల్లోకి బూత్ లెవెల్ ఆఫీసర్స్ ఓట్ల వెరిఫికేషన్ కు వచ్చినప్పుడు మన బూత్ ఏజెంటులు వారితో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను స్వయంగా వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. బూత్ ఏజెంట్లు చేసే ఓట్ల వెరిఫికేషన్ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంతో విలువైనవి అని దిశా నిర్దేశం చేశారు. మన పార్టీ ఓట్లు, సానుభూతిపరులు ఓట్లను చాలా జాగ్రత్తగా కాపాడుకోవాల్సి ఉందని రాబోయే అన్ని రకాల ఎంపీ, ఎమ్మెల్యే, జడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు ఈ ఓటర్ల సర్వే ద్వారా ముద్రణ అయ్యే లిస్టే ఫైనల్‌ది అని తెలిపారు. ఒకవేళ ఓటర్ల వెరిఫికేషన్‌లో ఏమైనా సమస్యలు ఎదురైతే మన పార్టీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు. గ్రామ పార్టీ నాయకత్వం బూత్ లెవల్ ఏజెంట్లు ఎవరికోసమో పనిచేయటం, పనిచేయక పోవడం చేసేది కాదు. బూత్ లెవెల్ ఏజెంట్లను గ్రామ, మండల స్థానిక పార్టీ నాయకత్వం సమన్వయం చేసుకుంటూ ఓట్ల సమగ్ర సర్వేలో బాధ్యతగా పాల్గొనాలన్నారు. సర్ టాస్క్ ఫోర్స్ మెంబర్ మర్లపాటి. మహేష్ మాట్లాడుతూ ప్రతి ఓటర్లను బీఎల్వో, టీబీఎల్ఏల సమక్షంలో మ్యాపింగ్ చేయాలన్నారు. ఫారం 6,7,8 వెరిఫికేషన్ అప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఒక్క ఓటుతో ఓడిపోయిన అనుభవాలు చాలా ఉన్నాయని అందుకే ప్రతి ఓటును చాలా జాగ్రత్త చేయించుకుని నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి, షేక్ రఫీ, ముప్పవరపు కిషోర్, నన్నం పోతురాజు,నోటి వెంకటేశ్వర రెడ్డి, అనుమోల.లక్ష్మీ నరసింహ, ఈదర రమేష్,కాపులూరి కృష్ణ, పులి. రమేష్, పెన్నా కృష్ణయ్య, చీమల వెంకటరాజా, గొర్ల.రమేష్, దేవిశెట్టి రాజేష్, వాకా.సురేందర్ రెడ్డి, ఉండెల ఆదినారాయణ రెడ్డి, పాలవెల్లి.అమర్నాథరెడ్డి,పాశం కొండయ్య,బిల్లా.రమణయ్య, బద్దిపూడి.జయరావు,ఉచ్చులూరి రవీంద్ర, కాపులూరి మధుసూదన్, మదన్మోహన్ రెడ్డి, షేక్ రహీం, కొత్తా.మహేష్, తాటిపర్తి. రమేష్, ఆది లక్ష్మి,వరలక్ష్మి, వసంత లక్ష్మి ధరణి తదితరులు పాల్గొన్నారు



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

## ప్రకాశం

### వలేటివారిపాలెం ఎస్ఐగా ప్రేమ్ కుమార్

**వలేటివారిపాలెం, జూన్ 3 (జాతీయ వార్త):** వలేటివారిపాలెం ఎస్ఐగా ప్రేమ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా జూదాలు, కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

### ఎమ్మెల్యేను కలిసిన ఎస్సై ప్రేమ్ కుమార్



వలేటివారిపాలెం పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ప్రేమ్ కుమార్ బుధవారం కందుకూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని మర్యాదపూర్వకంగా కలిశారు.

### అక్షరాస్యుల పెంపే అక్షరాంధ్ర లక్ష్యం




**ఉలవపాడు, జూన్ 3 (జాతీయ వార్త):** ఉలవపాడు మండలంలో 3,030 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉలవపాడు ఎంపీడీవో సురేష్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం ఉలవపాడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అక్షరాంధ్ర మండల కమిటీ సమన్వయ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది నిర్వహించిన సర్వే ప్రకారం మండలంలోని 16 సచివాలయాల పరిధిలో మొత్తం 6,050 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించినట్లు సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా వయోజన విద్య పర్యవేక్షకులు శాతల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తొలి విడతలో 3,030 మందిని అక్షరాస్యులుగా మార్చే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. లక్ష్యంగా ఎంపిక చేసిన వారందరినీ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు అక్షరాంధ్ర యాప్ ద్వారా నమోదు చేయనున్నట్లు చెప్పారు. అలాగే నిరక్షరాస్యులకు ఎంపికైన వాలంటీర్ టీచర్లచే జూలై మూడో వారంలో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్‌తో పాటు వీడియో పాఠాల ద్వారా మొత్తం 100 గంటల శిక్షణ అందించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి-2 రమణయ్య, డిప్యూటీ ఎంపీడీవో జగదీష్ బాబు, ఏపీఎం కృష్ణయ్య, వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, వీవోలు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి కూలీలకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి

**వలేటివారిపాలెం, జూన్ 3 (జాతీయ వార్త):** ఉపాధి కూలీలకు రెండుపూటలా మస్టర్ వేసే విధానాన్ని రద్దు చేయాలని, కూలీలకు ఫేస్ యాప్‌ను తీసేయాలని, రోజుకు 700 కూలి ఇవ్వాలని, 200 రోజులు పని కల్పించాలని సిఐటియు జిల్లా నాయకులు జి వి బి కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని చెర్లోపాలెం లోని మర్రి చెట్టుకుంట లో పూడికతీత పనులు చేస్తున్న పని ప్రదేశాన్ని పరిశీలించి, ఉపాధి కూలీలతో మాట్లాడారు. వామపక్షాల ఒత్తిడితోనే 2006లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం వచ్చిందని తెలిపారు. ఈ పథకం వేసవిలో గ్రామీణ ప్రాంతంలోని రైతులకు, కూలీలకు ఎంతో ఆసరాగా ఉపయోగపడిందని తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తుందని తెలిపారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి వి బి జి రాంజీ అనే కొత్త స్కీం ని జూలై నుంచి ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తుందని తెలిపారు. ఇదే అమల్లోకి వస్తే కూలీలు నష్టపోతారని పేర్కొన్నారు. ఈపాటికి ఉపాధి కూలీలకు అనేక రాయతీలు కోల్పోయారని తెలిపారు. కూలీలకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడితే భవిష్యత్తులో ఉద్యమాన్ని చేస్తామని హెచ్చరిక చేశారు. ఈ పని ప్రదేశంలో ఉపాధి మెట్లు మద్దులూరి వెంకటేశ్వర్లు, నత్త రజనీకాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.





### వెన్నుపోటులో పేటెంట్ హక్కు

# చంద్రబాబు నాయుడుదే..!

*** నేటి నుంచి నిరసన కార్యక్రమాలు * వైసీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్**

**కందుకూరు, జూన్ 3 (జాతీయ వార్త):** నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజలను వెన్నుపోటు పొడవడంలో చంద్రబాబు నాయుడు డిగ్రీలు సంపాదించాడని, రాష్ట్ర ప్రజలను రెండేళ్లుగా మాయమాటలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పొడుస్తున్నాడని, పిల్లనిచ్చి పెళ్లి చేసి అల్లున్ని చేసుకున్నందుకు తండ్రి లాంటి మామను వెన్నుపోటు పొడిచి పదవి లాక్కున్నవాడు చంద్రబాబు నాయుడని.. మొత్తంగా వెన్నుపోటు పొడవడంలో చంద్రబాబు నాయుడు పేటెంట్ హక్కుకి మారుపేరుగా మారారని వైసీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ ధ్వజమెత్తారు. బుధవారం కందుకూరులోని వైఎస్ఆర్సిపి నియోజకవర్గ కార్యాలయంలో వెన్నుపోటుకు రెండేళ్లు పోస్టర్‌ను, బుక్ లేట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నిటితో పాటు ఇంకా అదనంగా సూపర్ సిక్స్ పథకాలను ఇస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాలను అమలు చేయకుండా నమ్మిన ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలకు అనేక హామీలు ఇచ్చి నిలువునా మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు 18 సంవత్సరాల వయసు దాటిన మహిళలందరికీ ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు 1500 అందిస్తామని చెప్పి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న ఆ పథకాన్ని అమలు చేయకుండా ఆడబిడ్డలను అవమానపరిచారని అన్నారు. భర్తను కోల్పోయి కుటుంబం జరగక ఇబ్బందులు పడుతున్న వితంతు మహిళలకు పెన్షన్ మంజూరు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. మహిళలకు అరకొరగా ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకాన్ని కూడా నీరు కార్చేదానికి కంకణం కట్టుకున్నాడన్నారు. మహిళలకు ఇచ్చిన మరొక హామీ ఉచిత గ్యాస్ అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకున్నాడని ఇప్పుడు ఆ ఉచిత గ్యాస్ పథకం అమలు అవుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొందని చెప్పారు. ఇచ్చిన హామీలను ఈ రెండేళ్ల కాలంలో ఏ ఒక్కటి అమలు చేయకుండా అన్ని వర్గాలతో పాటు రాష్ట్రంలోని నిరుద్యోగులను నిలువునా ముంచారని విమర్శించారు. అధికారంలోకొస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రతి ఒక్క నిరుద్యోగికి నెలకు 3000 నిరుద్యోగ భృతి కల్పిస్తామని ప్రలోభ పెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతిని ఇవ్వకపోగా జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే దానిని కూడా సక్రమంగా నిర్వహించలేక తమ అనుయాయులకు అమ్ముకున్న దుర్మార్గమైన పరిస్థితి రాష్ట్రంలో నెలకొని ఉందన్నారు. రాష్ట్రంలో అన్నదాతలను పట్టించుకోకుండా గిట్టుబాటు ధర కల్పించకుండా పెట్టిన పెట్టుబడులు చేతికి రాక అప్పులు భారంతో అలమటిస్తుంటే ఏడాదికి 20 వేలు ఇస్తామని చెప్పిన అన్నదాత సుఖీభవ పథకాన్ని కూడా తుంగలో తొక్కి చంద్రబాబు రైతులను నట్టేట ముంచారని తెలిపారు. జగనన్న పరిపాలనలో రైతులకు ఉచిత బీమా పథకాన్ని అమలు చేస్తే ఇప్పుడు రైతులే ప్రీమియం చెల్లించాల్సి వస్తుందని, ఇది రైతులకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పండించిన ఏ ఒక్క పంటకు మద్దతు ధర లేక రైతులు అవస్థలు పడుతుంటే పట్టించుకునే నాథుడే కరువయ్యారని అన్నారు. నియోజకవర్గంలో పొగాకు రైతు బేళ్లు ఇళ్లల్లో పెట్టుకుని కునారిల్లిపోతున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం ప్రజలు సంతోషంగా లేరు, ఆరోగ్యశ్రీని అటకెక్కించి ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేసే పనిలో బిజీగా వుందన్నారు. విద్యార్థులకు అందవలసిన ఫీజు రియంబర్స్మెంట్, వసతి దీవెన, విద్యా దీవెన, అమ్మ ఒడిలాంటి పథకాలను కూటమి పాలకులు తుంగలో తొక్కుతున్నారని తీవ్రంగా విమర్శించారు. పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్నప్పటికి పాఠ్యపుస్తకాలు, యూనిఫార్మ్, బ్యాగు, బూట్లు, బెల్టు లాంటి విద్యార్థికిట్టు ఇంతవరకు పాఠశాలలకు చేరలేదని అన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయకపోగా మాయ మాటలు చెప్పి నమ్మి ఓట్లు వేసి మోసపోయామని ప్రజలు గమనించారు. సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రజలను పక్కదారి పట్టించాలనే ఉద్దేశంతో డైవర్ట్ రాజకీయాల చేస్తూ కూటమిపాలకులు పబ్బం గడుపుతున్నారన్నారు. చంద్రబాబు నాయుడు రెండేళ్ల వెన్నుపోటు పాలనపై ఈనెల 4వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నటువంటి నిరసన కార్యక్రమాల్లో భాగంగా నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు అదే విధంగా 8,9 తేదీల్లో నియోజకవర్గ కేంద్రంలో నియోజకవర్గస్థాయి సెమినార్‌ను నిర్వహిస్తున్నామన్నారు. చంద్రబాబు నాయుడు పాలన అరాచకాలను వ్యతిరేకిస్తూ 12వ తేదీన నియోజకవర్గస్థాయిలో భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు, నిరసన కార్యక్రమంలో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మర్లపాటి మహేష్, తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి, షేక్ రఫీ, ముప్పవరపు కిషోర్, పాశం కొండయ్య, బిల్లా రమణయ్య, బద్దిపూడి జయరావు, ఉచ్చులూరి రవీంద్ర, నన్నం పోతురాజు, నోటి వెంకటేశ్వర రెడ్డి, అనుమోల.లక్ష్మీ నరసింహ, పులి. రమేష్, కాపులురి మధుసూదన్, మదన్మోహన్ రెడ్డి, షేక్ రహీం, కొత్తా.మహేష్, ఆది లక్ష్మి, వరలక్ష్మి, ధరణి తదితరులు పాల్గొన్నారు.

## అధ్వానంగా బజార్ రోడ్డు

*** నిత్యం ప్రమాదాలు * వాన పడితే చెరువులా.. రోడ్డు * పట్టించుకోని అధికారులు, నేతలు**



**వలేటివారిపాలెం, జూన్3 (జాతీయ వార్త):** అంక భూపాలపురం గ్రామంలో కొత్త మేడ బజార్ రోడ్డు అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షానికి రోడ్డు బురదగా మారుతోంది. రోడ్డుపైనే నీరు ఉండడంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలల క్రితం శాసనసభ్యులు ఇంటూరు నాగేశ్వరరావు 10 లక్షల రూపాయలు ఓపెన్ డ్రైనేజీకి శాంక్షన్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా దాన్ని మాన్యువల్ పైప్ లైన్‌గా మార్చి 10 లక్షల రూపాయలు నిధులు నిరుపయోగంగా చేశారని విమర్శలు ఉన్నాయి. సంబంధిత అధికారులు, నేతలు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు చేస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు.



### ఎమ్మెల్యే ఇంటూరిని కలిసిన ఉప విద్యాశాఖ అధికారి



**కందుకూరు, జూన్ 3 (జాతీయ వార్త):** కందుకూరు డిప్యూటీ డిఈఓగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన రవి కందుకూరులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని మర్యాదపూర్వకంగా కలిశారు. బొకే ఇచ్చి శాలువాతో సత్కరించారు. రవి ప్రస్తుతం నాగులుప్పలపాడు ఎంఈఓగా పనిచేస్తూ, కందుకూరుకు ఇంచార్జి డిప్యూటీ డిఈవోగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. కందుకూరు పూర్వ ఎంఈఓ అజయ్ బాబు, ఉపాధ్యాయులు తల్లపనేని శ్రీనివాసరావు, ఏలూరి బ్రహ్మయ్య, తొట్టెంపూడి రామచంద్ర, ఇంటూరి శ్రీనివాసరావు, సోమినేని రవిచంద్ర, ఆరెబోయిన వెంకటేశ్వర్లు, తోట శ్రీనివాసరావు, పి.రామమోహన్, పొన్నం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### పెద్ద బంగారయ్యకు నివాళులర్పించిన ఎమ్మెల్యే ఇంటూరి

**వలేటివారిపాలెం, జూన్ 3 (జాతీయ వార్త):** మండలంలోని కలవల్ల గ్రామానికి చెందిన మోదేపల్లి పెద్ద బంగారయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం గ్రామంలోని వారి గృహానికి వెళ్లి బంగారయ్య పార్థివదేహానికి, పూలమాలవేసి నివాళులర్పించారు. తదుపరి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546